
# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శుక్రవారం 25 అక్టోబరు 2024 www.prajaaswaramdaily.com 2pm


## బిష్ణోయ్‌పై రూ.10 లక్షల రివార్డు

**ముంబయి:** బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌పై బెదిరింపులు, మహారాష్ట్ర రాజకీయ నేత బాబా సిద్ధిఖీ హత్య వంటి కారణాలతో దేశవ్యాప్తంగా లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరు మారుమోగుతోంది. ఈ తరుణంలో లారెన్స్ సోదరుడు అన్మోల్ బిష్ణోయ్ పై జాతీయ దర్యాప్తు సంస్థ రూ.10 లక్షల రివార్డు ప్రకటించింది. 2022లో నమోదైన రెండు కేసుల్లో అతడు అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అంతేగాకుండా సిద్ధిఖీ హత్య కు ముందు సైతం షూటర్లతో అన్మోల్ చాటింగ్ చేసినట్లు ముంబయి పోలీసులు వెల్లడించారు. ఈక్రమంలో అతడి గురించి సమాచారం ఇచ్చినవారికి ఈ రివార్డు ఇస్తామని ఎన్ఐఏ తెలిపింది.



## ఈ పద్ధతి ఎప్పటికైనా హానికరమే



**ముంబయి :**సామాజిక మాధ్యమంలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటారు బాలీవుడ్ నటి అలియా భట్ తాజాగా పెట్టిన పోస్ట్ వైరల్‌గా మారింది. తనపై సోషల్ మీడియాలో వస్తోన్న కామెంట్స్, యూట్యూబ్‌లో షేర్ అవుతోన్న వీడియోలపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తన శరీరంపై, మాట్లాడే విధానంపై అసభ్య కామెంట్స్ చేసేవారికి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ఎలాంటి ప్రూఫ్ లేకుండా ఇష్టానుసారం ఇలాంటి రూమర్స్ వ్యాప్తి చేసేముందు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. “ నేను అందం కోసం సర్జరీలు చేయించుకున్నాను.. అలాగే వారి దృష్టిలో నాకు పక్షవాతం కూడా వచ్చింది. ఎలాంటి నిర్ధరణ చేయకుండా ఇలాంటి రూమర్స్ సృష్టించి మీరంతా తమాషాలు చేస్తున్నారా? ఎలాంటి ప్రూఫ్ లేకుండా ఎదుటి వ్యక్తులపై ఇలాంటి కామెంట్స్ చేయడం నేరమని మీకు తెలియదా? కేవలం వ్యూస్ కోసం ఇలా చేయడంలో అర్థం లేదు. ఇలాంటి కామెంట్స్ చేసేవారిలో మహిళలు కూడా ఉండడం సిగ్గుచేటు. ఈ పద్ధతి ఎప్పటికైనా హానికరమే'' అని పేర్కొన్నారు. ఈ పోస్ట్‌కు పలువురు సెలబ్రిటీలు మద్దతు ఇస్తున్నారు.

అలియాభట్

# పేదలను రోడ్డుకీడ్చిన ప్రభుత్వం

- మీ సోదరుడి ఇంటి ఒక్క ఇటుకనూ ముట్టలేదు
- సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన బీఆర్ఎస్

**హైడ్రాకు నేటితో 100 రోజులు పూర్తయిందని... హైడ్రా పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల జీవితాలను రోడ్డుకీడ్చిందని బీఆర్ఎస్ ఎక్స్ లో విమర్శలు చేసింది. 100 రోజుల్లో హైడ్రా బుల్డోజర్ మీ సోదరుడు తిరుపతిరెడ్డి ఇంటి ఒక్క ఇటుకను కూడా ఎందుకు ముట్టలేక పోయిందో సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించింది..**




హైదరాబాద్, ప్రజాస్వరం : వెయ్యి ఎలుకలు తిన్న పిల్లి తీర్థ యాత్రలు చేసినట్టుగా హైదరాబాద్ మహానగర కబ్జాలను ప్రోత్సహించిన కాంగ్రెస్... కొత్తగా పరిరక్షణ పేరుతో డ్రామాలు ఆడుతోందని బీఆర్ఎస్ విమర్శించింది. ప్రజాపాలన అని పేదల జీవితాలను బజారుకీడ్చిన బరితెగింపు మీ ప్రజా ప్రభుత్వం నినాదానికి తిలోదకాలు ఇవ్వడం కాదా? అని ప్రశ్నించింది. కబ్జాలు చేసి... కార్పొరేట్లకు ఊడిగం చేసి... ఆ పేదలు ఇళ్లను నిర్మించుకోలేదని, రూపాయి... రూపాయి కూడబెట్టి శ్రమకోర్చి సొంతింటిని నిర్మించుకున్నారని పేర్కొంది. కనీసం నోటీసులు ఇవ్వకుండా హైడ్రా పేరుతో కూలగొట్టేందుకు మనసెలా వచ్చిందని సీఎంను ప్రశ్నించింది. పేదల నివాసాలు అక్రమ నిర్మాణాలైతే... వాటికి అనుమతులు ఇచ్చిన అధికారుల అంతుచూడకుండా అన్యాయం... అధర్మమంటే ఎరగని సామాన్య జనంపై ఈ బుల్డోజర్ దాడులు ఎవరి కోసం? రాహుల్ గాంధీ ఏమో బుల్డోజర్ సర్కార్‌ను వ్యతిరేకిస్తాడు... మీరేమో ఇక్కడ యధేచ్ఛగా బుల్డోజర్ విధానాలను కొనసాగిస్తున్నారు? మీ పార్టీకి ఒక స్పష్టమైన విధానమంటూ ఉండదా? అంటూ ప్రశ్నల సంధించింది. ఇప్పటికీ చెప్తున్నాం... హైడ్రా పేరుతో పేదలను నిరాశ్రయులను చేస్తామంటే ... ఆ హైడ్రా బుల్డోజర్లకు అడ్డుపడతామని పేర్కొంది.

## అలాంటి వ్యాఖ్యలు సరికాదు

- మంత్రి సురేఖకు న్యాయస్థానం ఆదేశం





**హైదరాబాద్, ప్రజాస్వరం:** మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ గౌరవ అధ్యక్షుడు కేటీఆర్ వేసిన పరువు నష్టం దావాపై సిటీ సివిల్ కోర్టు విచారించింది. భవిష్యత్తులో అలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సురేఖను న్యాయస్థానం చెప్పింది. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోలను న్యూస్ చానళ్లు, యూట్యూబ్, సోషల్ మీడియాలో తొలగించాలని పేర్కొంది. అనంతరం తదుపరి విచారణను కోర్టు వచ్చే నెల 21కి వాయిదా వేసింది. తన పరువుకు భంగం కలిగేలా మంత్రి వ్యాఖ్యలు చేశారంటూ ఆమెపై రూ.100కోట్లకు కేటీఆర్ దావా వేయడం విదితమే.

## భద్రాద్రి రామయ్య సన్నిధిలో గవర్నర్



**భద్రాచలం, ప్రజాస్వరం:** భద్రాచలం సీతారామచంద్రస్వామి వారిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దర్శించుకున్నారు. ప్రధానాలయంలోని ధ్రువమూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం పలికారు. గవర్నర్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ ఈవో రమాదేవి అందజేశారు. అంతకుముందు గవర్నర్‌కు కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్ స్వాగతం పలికారు. గవర్నర్‌తో పాటు మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆంజనేయస్వామి, లక్ష్మీ తాయారు అమ్మవారిని దర్శించుకున్నారు.

## రైళ్ల రాకపోకలకు అంతరాయం

**కేసముద్రం, ప్రజాస్వరం:** మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఓ గూడ్స్ రైలు సాంకేతిక సమస్యలతో నిలిచిపోయింది. దీంతో విజయవాడ- కాజీపేట మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మహబూబాబాద్ స్టేషన్ సమీపంలో పలు రైళ్లు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న రైల్వే అధికారులు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.



## అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

- మెకానిక్ షెడ్డులో కాలిపోయిన 9 వాహనాలు... షార్ట్ సర్క్యూట్‌యే కారణం
- తూప్రాన్‌లో ఘటన

**తూప్రాన్, అక్టోబర్ 25 (ప్రజాస్వరం):** తూప్రాన్ లో గురువారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం జరిగింది. దీంతో తొమ్మిది వాహనాలు కాలిపోయాయి. మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా గల కారు లిమ్రా మెటార్స్ కారు మెకానిక్ షెడ్ లో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగాయి. మంటలు అంటుకొని తొమ్మిది వాహనాలు కాలిపోయాయి. ప్రమాద సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. కాగా, షాపు యజమాని సోయల్ రోజూలాగే ప్రమాదం జరిగిన రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లిపోయాడు. ప్రమాదం విషయం తెలుసుకొని ఆవేదన వ్యక్తం చేశారు.



# టీమిండియా ఆలౌట్

- కివీస్‌తో రెండో టెస్ట్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 156 రన్స్

**పుణే :** భారత్‌తో జరుగుతున్న రెండో టెస్టులో న్యూజిలాండ్ 103 పరుగుల తొలి ఇన్నింగ్స్ లీడ్ సాధించింది. కివీస్ తొలుత 259 పరుగులు చేయగా.. భారత్ మొదటి ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే ఆలౌటైంది. మిచెల్ శాంట్నర్ (7/53) దెబ్బకు టీమ్‌ఇండియా బ్యాటర్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. అతడితోపాటు గ్లెన్ ఫిలిప్స్ (2/26), టిమ్ సౌథి (1/18) భారత్‌ను కట్టడి చేయడంలో కీలక పాత్ర పోషించారు. స్పిన్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా (38) టాప్ స్కోరర్ కావడం గమనార్హం. యశస్వి జైస్వాల్ (30), శుభ్‌మన్ గిల్ (30) మాత్రమే ఫర్వాలేదనిపించారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (18★) దూకుడుగా ఆడేందుకు ప్రయత్నించాడు. ఒకే ఓవర్‌లో రెండు ఫోర్లు సిక్స్ కొట్టడంతో భారత్ స్కోరు 150 దాటేసింది. రోహిత్ (0), బుమ్రా (0) డకౌట్ కాగా.. విరాట్ కోహ్లి (1), అశ్విన్ (4), ఆకాశ్ దీప్ (6), రిషభ్ పంత్ (18), సర్ఫరాజ్ ఖాన్ (11) ఎక్కువ పరుగులు చేయలేకపోయారు.




## రోటిబండ తండాలో ఉద్రిక్తత

**ఫార్మా విలేజ్ కు వ్యతిరేకంగా ధర్నా**

**వికారాబాద్,ప్రజాస్వరం:** ఫార్మా విలేజ్ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. దుద్యాల మండలం రోటిబండ తండాలో ఫార్మా విలేజ్‌కు వ్యతిరేకంగా స్థానికులు ధర్నా చేపట్టారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడి కారుపై రాళ్ల దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఆయనకు స్వల్ప గాయాలయ్యాయి. ఫార్మా విలేజ్‌ను వ్యతిరేకిస్తూ పలువురు రైతులు ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. దీంతో పోలీసులు వీరిని అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీ భవనం వద్ద పోలీసులు, నిరసనకారుల మధ్య తోపులాట చోటుచేసుకుంది. పోలీసుల లాఠీఛార్జిలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల ఆందోళనతో ఫార్మా విలేజ్ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా పడింది.

## కాపరిని వెంబడించిన చిరుత

సారంగాపూర్, ప్రజాస్వరం: నిర్మల్ జిల్లాలో చిరుత సంచారం కలకలం సృష్టించింది. సారంగపూర్ మండలం రవీంద్రనగర్ సమీపంలో సహ్యాద్రి కొండల వద్ద మేకల కాపరిని చిరుత వెంబడించింది. అతడు చెట్టు ఎక్కి కేకలు వేయడంతో అక్కడి నుంచి వెనుదిరిగింది. ఈ క్రమంలో రెండు మేకలను చంపింది. దీంతో స్థానికుల్లో భయాందోళన నెలకొంది.



# తాగునీటి కోసం ఆందోళన

- బిందెలను పగలగొట్టి.. రంగాయిపల్లి మహిళలనిరసన

తూప్రాన్ / మనోహరాబాద్ : తాగునీటి కోసం ఖాళీ బిందెలతో మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామ మహిళలు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలను పగలగొట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చాలా రోజులుగా మిషన్ భగీరథ నీరు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఆపి ప్రైవేట్ పరిశ్రమలకు సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. అందువల్లే దాహార్తికి ఇబ్బంది పడుతున్నామన్నారు. ఆందోళన విషయం తెలుసుకున్న అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. ఇక తాగునీటిని ఎలాంటి ఇబ్బంది రానివ్వమని నిరంతరం సరఫరా చేస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు.

